# తులసిమొక్కలు

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

"ఇక్కడ మునగడమూ గుండువారి రేవులో తేలడమూనూ; అక్కడికి ముందెవరు వెళితే వాడికి తక్కినవాళ్లు పందరూపాయ లివ్వడం. ఏమంటారు?" అని ప్రకాశము నిక్కచ్చిగా నడుగగా "నేనంటే నేనూ నూ" అని నలుగురైదుగురు విద్యార్థులు సిద్ధపడిరి; గాని యందొకడు "రూపాయల పందెం యేమిటిరా! ఓడిపోయినవాళ్లు పోతుగట్టుమీద యెక్కడ నుంచో కుండా మైలుదూరం పరుగెత్తడం. ఏం చెబుతావు!" అని యడిగె తక్కినవారు అంగీకరింపకపోగా వెను తిగ్గెను.

మొత్తము నలుగురు ముందుకువచ్చిరి. "పంయే" అంటే "పంయే" అనకమున్న తరువాత పైవారిలో నొకడు చప్పటులు చరుపగా ఆనలుగురును ఒక్కసారి బుడుంగున మునిగిరి. తక్కినవారందరును ఒడ్డెక్కి గుండువారిరేవునకు పరుగెత్తుకొనిపోయిరి.

పదిబారలలో నొకడు తేలి "నావాటా ముప్పయిమూడురూపాయ లవుతాయి. సాకేస్తాను" అని పలుకుచు నొడ్డెక్కెను. మరి పదిబారలలో నింకొక్కడును. అరఘడియలో మరియొక్కడును తేలి ఒడ్డెక్కిరి.

అది మాఘమాసము. నాడు ఆదివారము. మార్కండేయస్వామిని సేవింపవచ్చి అనేకజాతుల స్త్రీలు గుండువారిరేవులో స్నానములు చేయుచుండిరి. నీటికాసు బ్రాహ్మణులపని చాలతోరి త్రొక్కుడుగా నుండెను. తక్కువజాతి మగపిల్లలు కొందరు కోతులాడుచు నడుమనడుమ బ్రాహ్మణులచే నదలింపబడుచుండిరి.

సాహసముగల విద్యార్థులు కొందరు మెట్లుదిగి నీటిచెంతకుబోగా స్త్రీల కీలనైశిత్యము నెరిగిన మరికొందరు ఒడ్డుమీదనే యుండిపోయిరి. అందరును ప్రకాశమురాకను గమనించుచు గోదావరిదెసకు చూచుచుండిరి "మునిగి రెండురు రావడమురా ఫర్లాంగుపైగానూ. ప్రకాశంమాత్రం పూడిపడ్డాడా యేమిటి మనకంటే!" అని మొదట తేలినవా డనగా "మనం యింతదూరం వచ్చాముగాని వాడూ అక్కడే తేలివుంటాడు" అని రెండవవా డనియెను. "వాడుగూడా అక్కడే తేలితే మరి రూపాయలెవరికి యివ్వడం?" అని మూడవవా డడుగగా "కాశీకోటలువాళ్లకి" అని చప్పటులు కొట్టినవాడొక డనియెను.

పైని యిట్లుండగా నీటిలో నొక కుర్రవాడు "బాబోయి యెంతచేపో" యని యులికిపడెను. నీటికాసు బ్రాహ్మణు డొకడు "మొసలి" అని యెగిసిపడెను. ఒక బ్రాహ్మణుడు సంకల్పము చెప్పుచుండగా స్నానము చేయుచున్న యొక బాలిక "అమ్మోయి" అనియొగిరిపడి నీటిలో మునిగెను. కంగారుపడి యిద్దరుముగ్గురుయువతు లామెను లేవదీయునంతలో ప్రకాశ మామె యెదుట తేలి నిలిచెను.

తోడనే పెద్ద గందరగోళమైనది. "నువ్వు మనిషివికావూ!" అని యెగసిపడిన బ్రాహ్మణుడు మండిపడెను. చాలమంది స్త్రీలు చుట్టుకొనిరి. "చిన్నాడవా చితకాడవా! పైగా బ్రాహ్మడవు కూడానూ. ఇలాంటి పనే చెయ్యడం!" అని యొక ప్రౌఢ కసరుకొనగా "అడతోడున పుట్టలేదూ నువ్వు? మరిలిగివచ్చి మాపిల్లనిపట్టుకుంటావా! చూడుమరి" అని మరమర తీరముదెస చూచుచు "మీ బావని తీసుకురా. తమ్ముడూ" అనియొక యువతి పలికెను. అక్కడనేయున్న యామె తమ్ముడు మండిపడుచు బూతులు ప్రారంభించెను. బాలిక యింకను గడగడ వడకిపోవుచునే యుండెను. ప్రకాశము ఏమియు చెప్పలేక స్థాణువువలె నిలిచియుండెను. అప్పుడు పై

మున్న విద్యార్థులలో నొకడువచ్చి జరిగిన సంగతి యంతయు చెప్పి ఈపొరపాటు మన్నింపవలసినదని కోరెను; కాని లాభము లేకపోయినది.

ఇంతలో నొక పురుషుడు ముగ్గురుపోలీసులను దీసికొనివచ్చి "అరదండాలు తగిలించండి దీనెమ్మెరికి" అనిరెను. పోలీసులు: "ఏంపని చేశావయ్యా" అని ముంగోపములో నడుగగా "అలా వెర్రులాగ పూరుకుంటావేం మాట్లాడకా?" అని రెగిరిపడిన బ్రాహ్మణుడు వీపు మీద పొడిచెను. అప్పుడు ప్రకాశము "నేను చేసినపని చాలాతప్పే; కాని యిది బుద్ధిపూర్వకంగా చెయ్యలేదు. ఈసమయంలో యిక్కడ యింతమంది స్త్రీలు స్నానంచేస్తూవుంటారన్న పూహే నాకు కలగలేదు. ఇక జరిగిపోయినదానిని గురించి యేమనుకున్నా ప్రయోజనం లేదు, కనక నేను తగ్గిన మూడురూపాయలూ నీకిచ్చేస్తాను. క్షమించు" అని చేతులుజోడించుకొని పలుకగా బాలిక బిడియపడి మొగము ప్రక్కకు త్రిప్పికొనియెను. ఆమెతల్లి అంగీకరింపలేదయెను; గాని కొన్నవంద రూపాయలా? ఎవడికావాలి? బంకోలు పంపించేస్తాడు నిన్ను. ఇంకా చూస్తారేమయ్యా?" అని పోలీసులను హెచ్చరించెను. కేసులేకుండా చేసుకోవాలంటే పిల్ల కయినసంచలిచ్చి పోలీసోళ్ళకి సమాధానం చెప్పుకో" అని పోలీసులను తెచ్చిన యువకుడనియెను. "అయిదు వందలుకాదు. వెయ్యిరూపాయలు పుచ్చుకొని పైగా జైలుచేయించినా పాపంలేదు వీడికి. ఆపిల్లకి నూరు రూపాయలిస్తావన్నావు. రెండు గంటలనుంచి సంపాదించుకున్న డబ్బులు అయిదురూపాయలకుపైగా చేతులోవుండగా నీమూలాన్ని గోదావరిలో పడిపోయాయి; మరి నామాట యేమంటావు?" అని యాబ్రాహ్మణుడు తారాజువ్వవలె లేచెను.

విచారణ చేయగా ఆబాలిక వేశ్యయని తేలినది. పైనున్న విద్యార్థులలో నొకడు "నూరురూపాయలిస్తానంటుండగా యింకా నెక్కి-నెక్కి యేడుస్తుం దేమిరా భోగంపిల్లా?" అనియెను. దానిమీద నామెయన్న మండిపడి "పనికిరాదు. స్టేషనుకి తీసుకుపదండి" అని పట్టుపట్టెను.

రాజీ కుదురలేదు. "నీపేరే"మని యొక పోలీసడిగెను. "జంధ్యాల ప్రకాశం. జాఫ్రాబాదీవారి కొట్లలో బస. బి. యే. సీనియరుక్లాసు" అని ప్రకాశము చెప్పెను. పోలీసులాతనిని వెంటనిడుకొని స్టేషనుకు వెడలిపోయిరి. ఆబాలిక అన్నయగు మాధవరావును, తక్కిన విద్యార్థు లందరును, పోలీసులను దెచ్చిన యువకుడును వారివెంట నడచిరి. ఆబాలికయు, అక్కలు, తల్లి మున్నగుస్త్రీలు నడిచిపోయిరి. ఇదియంతయు చూచుచున్న యొకవృద్ధబ్రాహ్మణ వితంతువు "భోగంపైతే మాత్రం! ఎదిగినపిల్ల; తప్పుకాదూ?" అని తనదారిని బోయెను. ఆమాట ఆబాలిక నల్లగొండకు చివాలున తగిలెను.

౨

రంగనాయికి—ఆబాలిక తనవాళ్ళతో యిల్లు చేరి పాడిబట్టలు కట్టుకొనునప్పటికి సానులు చాలమంది చేరిరి. ఆమెతల్లియగు రాజామణి జరిగినదంతయు చెప్పెను. పెద్దక్క "రంగమ్మ చేజారైపోయిందే. దానికుండె లింకాకొట్టుకుంటూనే వున్నాయి" అనగా పోలీసులను తెమ్మనిన కొండకయక్క "అంతా బ్రాహ్మలే. కోనసీమజుట్టులావుంది. లేకపోతే అంతపని చెయ్యరు" అనియెను. మాణిక్యయక్క "వక బాపనోడు"భోగంపిల్ల రెుగిపెగిసిపడుతోం"దన్నాడు చూశావా? అసలు మునిగివచ్చినవాడు అతిగేవుండగా పైనున్నవాళ్ళే రెగిరిపడ్డారు. అందర్నీ జైలుచేయిస్తే మంచిది. అనగా నాల్గవయక్క "కేసూవద్దు గీసూవద్దు. కాసీల నప్పగిస్తే సరీ బాజాపడుతారు" అనియెను. అందరు నన్నివిధముల ననిరి. గుసగుసలు, విసవిసలు, ప్రగల్భవచనములు, చెలరేగెను. రంగనాయికకు "భోగందైతేమాత్రం! ఎదిగినపిల్ల. తప్పుకాదూ?" అనుమాట ఖంగుఖంగున వినబడినట్లయ్యెను. ఈస్థితిలో మాధవరావువచ్చి "వాడెవడైతే నాకేం! జైలులోపెట్టించేస్తా చూడు"మని యారడించెను. "ఏమయిన"దని యొకసాని యడుగగా "బహా, పేరూ, అన్నీరాసుగుని విడిచిపెట్టేరు. రేపు కేసుపెడతారు" అని యాతడు బదులుచెప్పెను.

ఎవరియింటికి వారు వెడలిపోయిరి. భోజనములునప్పటికి రంగనాయికి అక్కల సగసులు—ఒక

బ్రాహ్మణుడు, ఇరువురు వైశ్యులు, ఒక చౌదరి వచ్చిరి. అందరును దూరముగా నుండియే జరిగిన దానికి నవ్వుకొనిరి; గాని పోలీసులను తెచ్చిన వైశ్య యువకుడు "నేనెంతపని చేశానో చూశావా?" అని రంగనాయిక చేయిపట్టుకో బోయెను.

చేతిమీద చేయిపడినది; అంతే. ఇంకను పట్టుకొనలేదు. వెంటనే యామె త్రాచుపిల్లవలె "భోగం దాన్నయితేమాత్రం! చెయ్యి పట్టుకోవడమే!" అని కస్సుమనియెను. రాజామణి అసంతుష్టయై యూరకుండగా పెద్దక్క "యిప్పుడా పతివ్రతగారూ వేశ్యాకోటి?" అని బొమలు ముడుచుకొనియెను.

"వీరు చెయ్యి చేసుకుంటారండీ మాట్లాడితేనా" అని యాతనిపైని విసుగుకొనియెను. బ్రాహ్మణుడు "తొందరపడ్డావు" అనగా చౌదరి "అసలు రంగం ఉడికి పోతూవుంది పాపం" అనియెను.

రాజామణి బ్రాహ్మణునితో ఏదో చెప్పబోవుచుండగా రంగనాయిక "సానయితే యింత లోకువా! నాకక్కరలేదు సానరికం" అని చివాలున లోపలకు పోయెను. అందరును మొగమొగములు చూచుకొనిరి. దోషి, ప్రభుడై తనగదికి పోయెను. తక్కినవా రందరును కొంతసేపు రంగనాయిక శౌర్యమును గురించి మాట్లాడుకొని వెడలిపోయిరి.

రాజామణి శయ్యమీద బోరగిలపడి పడుకొని యున్న బిడ్డను "రంగా" యని పలుకరించెను: కాని యామె పలుకలేదు. "ఇంత శౌర్యం అయితే యెలాగే తల్లీ!" అనుచు రాజామణి ప్రక్కలో పరుండగా రంగనాయిక మొగముమాత్రం విప్పలకు త్రిప్పుకొని "నేను చెయ్యలేనమ్మా సానరికం. నాకు పెళ్లిచేసెయ్యి" అని మరల యథాస్థితిగ పరుండెను. ఆమాటవిని యామె ఉలిక్కిపడి ఆలోచనాధీన యయ్యెను.

రంగనాయిక పదునాలుగేండ్ల బాలిక. రజస్వలయై యారుమాసములైనది. ఇంకను కన్నెరికము కాలేదు. వీణావాదనము నేర్చుకొనుచున్నది. అక్కల పరువులామె కొకవరుని కుదుర్చుటలో వ్యగ్రులై యుండిరి. కన్నెరికము చేయుటకొక వర్తకుడు అంగీకరించెను; గాని అయిదువందలా ఎనిమిదివందలా యని వ్యవహారము జరుగుచుండెను. రాజామణి తన యాకడసారపు బిడ్డకు ఒక వైష్ణవునిచే కన్నెరికము చేయింప గోరుచుండెను; కూతుర్లు ఆ యాలోచనను ప్రత్యాఖ్యానములు చేయుచుండిరి.

కానిఅయితే పదునాలుగేండ్ల బాలికయే. అయినను సానులతోడను, పరుషుల వద్దను మసలుచున్న దగుటచే నామెకు కొంత ప్రౌఢిమ అబ్బియుండెను. ఈకారణములన ఆమె వృద్ధబ్రాహ్మణు విలంబుపుమాటను చక్కగ బోధపరుచుకొనగలిగెను. సహజముగ నామె మెత్తని పేరు. ముక్తసరు మనిషి. అక్కలవలెన రాసికొనుచు తిరుగదు. అందువేత వారప్పుడప్పుడామెను "ఇలాఅయితే పరుషుణ్ణిబాగానే మెప్పిస్తావు" అనీ, "బుద్ధి బాగానే వస్తుందనీ" యనుచుండుట అప్పుడెల్ల నామె "పోనీలెండి. వచ్చినంతలోనే గడుపుకుంటాను. నాగజాలు వచ్చిన పరుషుడే వుంటాడు. అసలు నేను మంచి బ్రాహ్మణ్ణి చూసి హాయిగా వెళ్లిపోయి వారింట్లో చాకిరీచేస్తూ బతుకుతాను" అనుచుండును.

## 3

మరునాడు పోలీసులు ప్రకాశముమీద కేసు పెట్టిరి. మాధవరావు వెంటవచ్చి ప్రకాశము కాలేజీలో తరగతిలో నుండగా నోటీసు ఇప్పించెను. దొర "ఏమి" టని యడుగగా ప్రకాశము జరిగినదంతయు చెప్పెను. మరి యొకచో పాఠములు చెప్పుచున్న వీరేశలింగము పంతులును పిలిచి దొరయంతయు చెప్పెను. ఇద్దరును ఒక్క క్షణము నిశ్శబ్దముగా నుండిరి. "నాతో చెప్పావు కాదేమీ?" యని పంతులడుగగా ప్రకాశము "ఇంతవరకూ వస్తుందనుకో లేదు" అనియెను. దొర గంభీరముగా చూడగా పంతులు ఆమాపుల నందుకొని వెడలిపోయెను.

వాయిదా రేపనగా ప్రకాశము పబ్లిక్ ప్రాసిక్యూటరగు రామదీక్షితుని యింటి కరిగెను. అప్పటి కప్పుడే వీరేశలింగము పంతులు వచ్చియుండెను. ప్రకాశము నమస్కరించి యిట్లు మాట్లాడెను.

"వేశ్యా బాలిక కేసుంగా రిపోర్టు దాఖలుచేసిన కేసులో నేను ముద్దాయిని—"

"అలాంటి పని చేశావేమి అబ్బాయీ?"

"నేను చేశానా అని నాకే సందేహం; కాని జరిగిపోయిందిమాత్రం తప్పులోనే చేరుకుంది"

"ఇంకా నింపాదిగా అంటున్నావా? పెద్దశిక్షే పడింది"

"అది మీచేతిలో వుంది. నేనిక్కడ బి. యే. సీనియరు తరగతి చదువుతున్నాను. ఈకేసులో మీరు దాఖలుచేసిన ప్లయింటుచూడగా నా భవిష్యత్తు గురించి చాలాభయం కలుగుతూవుంది. నాలుగో తరగతి మొదలు యింతవరకూ అపజయమనేది లేకుండా యీకాయిటాకీని పైకివచ్చాను. చాలామట్టుకుతమరుగూడా నాకు చందా లిచ్చివున్నారు కనక నాజీవితాన్ని గురించి మళ్లీచెప్పవలసిన పనిలేదు."

"తప్పుచెయ్యడానికి చదువుకూ సాధువుకూ భేదంవుందా?"

"అదిగాదు నేను మనవి చేసుకునేది. నేనుఅల్లరి బట్టలోనివాణ్ణి కానని నావిశ్వాసం. వీరేశలింగం పంతులుగారు నాగురువులు.—"

"బాగుపడతావు!"

"కాని మీరు దాఖలుచేసిన కేసు—"

"నష్టంచెయ్యమంటావు. నువ్వలా ప్రవర్తించావు"

నావుద్దేశాన్ని తమరు విమర్శించాలని కోరుతున్నాను. స్టీమరురేవులో మునిగి గుండువారిరేవులో తేలడానికి మాక్లాసువాళ్లం పోటీలుపడ్డాము. అందుకు యౌవనంయొక్క వ్యగ్రోత్సాహంతప్ప వేరేవీ కారణాలు లేవు"

"అది వ్యగ్రోత్సాహం అని నువ్వు చెప్పేటప్పుడు దానివల్ల యిలాంటివి సంభవిస్తాయని నే నింక చెప్పడం—"

"అంతటా ఫలం అలావుండకపోయినా ఆసమయంలో నావిషయంలో అలాగే జరిగింది"

"మునిగివెళ్లి తేలడంలో స్త్రీసంఘంలో అలా జరిగిందంటావు. ఇంతేనా నువ్వుచెప్పేదీ?"

"సరిగా అంతేనండి. ఆసమయంలో అక్కడ అంతమంది స్త్రీలు వుంటారని వూహించలేకపోయాను"

"స్త్రీలు కాకపోతే పురుషు లుంటారు. పోతే పసివుంటుంది. ఎలాగయినా ఆరేవులో తే... టట్లు పందెంవేసుకోవడంతప్పే"

"తప్పే అయింది. కనకనే పశ్చాత్తాపం"

"విప్రాః పశ్చిమబుద్ధయః"

"అది జాతి కంతకీ చెందిన కళంకం"

"ఇంతకీ నువ్వుచెప్పే దేమిటి?"

"జరిగిపోయిన సంగతికి మూలం యేమిటో, యేలా జరిగిపోయిందో మనవిచేశాను. నాస్థితి మనవి చేశాను. నాప్రార్థన యేమంటే? ఆపందెంలో నేను నూరురూపాయలు గెలిచాను. అవి అనాథలకు దాఖలు చేస్తాను. కేసుతప్పించి నన్నుకటాక్షించాలి తమరు."

"కోరిక మంచిదే. కేసులు రాజీకావడమే నా వుద్దేశం"

"ప్రయత్నిస్తే తమకు వ్యతిరేకం జరగదు. కళంకం రికార్డయిపోవడం వకటే, నాభవిష్యత్తు ధ్వంసంకావడం వకటీనీ. తమరుబాగా యోచించాలి"

దీక్షితులు దీనికి సమాధాన మాలోచించుచుండగా వీరేశలింగముపంతు లందుకొనిరిట్లు.

"దీనికి పర్యవసానం యేమిటో?"

"రెండువేలదాకా జరిమానా రెండేళ్లదాకా పరకమూనూ. అధికారి తన యిష్టాన్నమసరించి యిందులో యేదో వకటిగాని, రెండూగాని విధించవచ్చు."

"ముందు రుజువుకావాలన్నమాట."

"అంటే?"

"ముద్దాయీ యేవుద్దేశంతో వుండగా ఆపని జరిగిందో ఆవిషయం తేలవద్దూ?"

"జరిగిపోయినదానికేమో రేవంతా సాక్ష్యమే—"

ఈసమయమున ప్రకాశ మందుకొని "నేను జరిగిన సంగతంతా యిందాకానే మనవిచేశాను. కోర్టులో గూడా ఇలాగే చెబుతాను. దీనికి సాక్ష్యమే అక్కర

లేదూ. ఇది జరగలేదని వాదించను. క్షమించవలసిందనే మొదటినుంచీ నా ప్రార్థన అని చెప్పెను.

"కష్టసుఖాలూ, లాభనష్టాలూ, మంచిచెడ్డలూ వివరించి చెబుతాను. ఆయింట్లో తల్లిపెత్తనం వుంటే మాత్రం రాజీజరుగుతుంది. కాని ఆపిల్ల అన్న చాలా పట్టుదలగా వున్నాడు. అప్పుడు నీవాళ్లేమో లోగం జాతిని నిందించారట. పంతులుగారూ! అతనొక్కమాట చెప్పాడు. అదిమీతో చెప్పడం నాకు యిష్టంలేదు; దానికి నేనూ అంగీకరించలేను. రాజీకి అదొక్కటే మార్గంకాదు. ఆపిల్లాడు—"

"ఏమన్నాడూ?"

"చెప్పమంటారా!"

"వచ్చినకేసు సన్నమైనదికాదు. దానికి సంబంధించిన ఆలోచనలు తెగినట్టుగానే వుంటాయి. అయినా వినడానికేమి?"

"మీారిప్పుడు ఆపిల్లకి కన్నెరికం—"

ఈశబ్దము వినుటయే తడవుగ ప్రకాశము శ్రీహరీ యని చెవులుమూసికొనియెను. పంతులు ఉలికిపడెను.

"అందుకోసమే నేను చెప్పనన్నాను"

"ఆపిల్లాడు అలా అన్నాడా?"

"అవును. రాజకావాలంటే అదొక్కటే మార్గం అంటాడు."

"అందు కింకెవ్వరూ దొరకరూ?"

"లోటా? పిల్ల దీపంలావుంది. చాలా తెలివైనది. శీలం చాలా నిశితమైనదని తలుస్తాను."

"ఏమన్నారూ?"

"పరపురుషుడు తన్నుతాకినందుకు ఆపిల్ల చాలా కింసపడుతోంది"

"అయితే ఏంపని చేస్తారు?"

"ఏమిటది?"

"ఆపిల్లతల్లిని మాతోటలోకి ఒకమాటు పంపించగలరా?"

"దానికేమి?"

"అయితే సరే."

ఇట్లుచెప్పి పంతులు సెలవు పుచ్చుకొని బయలుదేరెను. ప్రకాశముగూడ దీక్షితునకు నమస్కరించి బయలుదేరెను. రాత్రి పదిగంటలకు రమ్మని ప్రకాశమును పంపివేసి పంతులు తనతోటకు వెడలిపోయెను.

## ౪.

దీక్షితుని వర్తమానమును విని సానులందరును తెల్లపోయిరి. పంతులుకు వేశ్యలనిన బద్ధవైరమని అందరెరుగుదురు. ఎందుకో యెవరికి నేమియు తోచలేదు. రాజామణి బయలుదేరగా పెద్దహాతురుగూడ వెంటబడెను.

రాత్రి యెనిమిదిగంటలైనది. అప్పుడే భుజించి వచ్చి పంతులు వెన్నెలలో పడకకుర్చీమీద కూర్చుండెను. సానులు వచ్చి నమస్కరింపగా ఆతడు కూర్చుండ గోరెను; గాని ఆకన్యకూతుర్లు ఇద్దరును వినయమును జూపి నిలిచియే యుండిరి. అందుకు పంతులు "లోకంలో జరిగే సంగతులు నాకు బాగా తెలుసును. ఎటువంటి వాళ్లుగూడా మిమ్మల్ని కూచోమనడం తమకు అగౌరవమని భావిస్తారు. కాని నావుద్దేశం అది కాదు. నాయెదుట మీారు ఆకుర్చీలమీద కూచోడం నాకు అమర్యాదకాదు. ప్రకృతం హిందూసంఘం స్త్రీల గౌరవాన్ని మరిచిపోయి వుంది. అంచేతనే దేశం యిప్పుడిలావుంది. ఇంగ్లీషు దొరతనం రాబట్టిగాని లేకపోతే మనం యింకా అధోగతిపాలై వుందుము. నోగుమాలిన వయస్సులో మీా రీపాడు వృత్తిలో ప్రవేశపెట్టబడ్డారు. మీావృత్తిని నే నసహ్యించుకుంటాను; కాని మంచి వుద్దేశంతో కబురుపంపించాను గనుక మిమ్మల్ని గౌరవించడం నావిధి. ఒక్క నాభార్యతప్ప తక్కిన స్త్రీలంతా నాకు తల్లులూ, తోడబుట్టువులునూ. కనక మీారు కుర్చీలమీద కూచోండి" అని చెప్పెను. చేయునది లేక సానులు కూర్చుండిరి. "వీరేశలింగం పంతులుగారు యిలాంటివారా!" అని సానులు ఆశ్చర్యపడిరి. పంతులడుగగా రాజామణి తన కుటుంబపు సంగతులన్నియు చెప్పెను. పంతులు యిట్లు చెప్పెను.

"నేనిప్పు డొకసంగతి చెబుతున్నాను. ఉలికిపడకండి. రాజామణీ! నువ్వు పెద్దదానవు. నీకు సంగతు

లన్నీ తెలుసును. పలుగురు కూతుళ్లని సానరికంలో దింపి కష్టమో, సుఖమో, లాభమో, నష్టమో అనుభవిస్తూ వున్నావు. కనక రంగనాయకకు పెళ్లి చేయకూడదూ? అప్రయత్నంగా ఏక పురుషుడు తన్ను తాకినందుకు ఆమె విచారిస్తోం దని చెబుతున్నావు. సంసారిణికి వుండవలసిన శీలసౌశీల్యం ఆమెకు పూర్తిగా వున్నట్లు నాకు తోస్తూవుంది."

"మాపిల్ల సానిగా వుండడానికే ముచ్చట పడుతూ వుందండి."

"అది శుద్ధాబద్ధం. యిప్పు డడిగిచూడు."

"ఇప్పటికీ దానికదే అభిప్రాయమండి. కాదంటే తమరుకూడా అడిగిచూడవచ్చు."

"నువ్వు నాకలాంటి అవకాశంయిస్తే యింకేలేని దేమిటి? రంగనాయకి నిప్పు డిక్కడికి రప్పించగలవా?"

రాజామణి చెప్పగా పెద్దకూతురు బండియెక్కి వెడలిపోయెను. ఈప్రస్తావము ఆమె చెప్పగా యింట నందరును తెల్లవోయిరి. రంగనాయకి మాత్రము యింకను వినుటకాత్రము చూపెను. ఆమెకు "భోగండ్లైతే మాత్రం? ఎదిగినబిడ్డ. తప్పుకాదూ?" అనుమాట స్ఫురణకు వచ్చెను. తోడనే ఆమె బయలుదేరెను. అదిచూచి తక్కిన అక్కలు ముగ్గురునుగూడ బయలుదేరిరి. అందుకు వారిపురుషులు తొలుత నసమ్మతిని జూపిరి; గాని తుద కంగీకరించిరి.

వీరు వచ్చులోపల పంతులు రాజామణి కనేక విషయములు చెప్పెను. రాజామణిగూడ చాలసేపు వాదించినది. "సానులు వుండడమూ, మానడమూ అంటే మానడానికీ నేనేకాదు సంఘమే వప్పుకోదు; కాని నా బిడ్డకి మీరు పెళ్లిచేస్తానంటే మీరుచెప్పిన కారణాలవల్ల వప్పుకుంటాను. సాధ్యమైతే మీరు ప్రయత్నించవచ్చు"నని యామె చెప్పినది. ఆమె యీమాటలు ముగించుచుండగా అందరును వచ్చిరి. అందరికంటెను ముందుగా రంగనాయకి పంతులుకు నమస్కరించి తల్లిచెంత నిలిచి పంతులు పిలువగా ఎదుటికిబోయెను. అందు కానందించి పంతులు లేచినిలిచి, రాజామణినిజూచి "మీరు మాగుర్తాకేవుండవచ్చును నీకూతుర్ని. మామాటలు మీకు వినబడకుండా వుండేటంత దూరంగా తీసుకుపోయి కొన్నిమాటలు చెప్పవలసివున్నాయి. ఏమంటావు?" అనిరెను. రాజామణి యందు కంగీకరింపగా పంతులు బయలుదేరెను. పిలువకుండనే రంగనాయకి పంతులు వెంట వెళ్లెను.

పంతులు తోటచెట్టుక్రింద కూర్చుండగా రంగనాయకిగూడ కూర్చుండెను. పిదప నిరువురును సంభాషణ ప్రారంభించిరి; గాని అది యెవరికిని వినబడనిది.

అక్కడ యేకాంతసంభాషణ జరుగుచుండగా యిక్కడ గుసగుసలు ప్రారంభమయ్యెను. "రంగమ్మకి పెళ్లి చెయ్యకూడదటే?" అని తల్లి యడుగగా పిల్లలందరు నందుకొనిరి. "కన్నెరికంతరవాయిగా సానయి వుండగా యిప్పుడెవరు పెళ్లాడుతారూ?" అని యొకతె యడిగెను. "అదికూడా సానయితే మన మేళంలోకి యొకపరాయిసాని పనివుండదు" అని యొకతె పలికెను." "కేసు యేమవుతుందో తేలీదాకా యేమాటా చెప్పలే"నని యింకొకతె యనిరెను. "సానరికంలోవుండే లాభనష్టాలు మనం చూస్తూనే వున్నాము. పంతులుగారు చెప్పేమాటలుగూడా బాగానే వున్నాయి" అని పెద్దపిల్ల చెప్పెను. ఒక్క అరగంట గడచినతరువాత పంతులువచ్చి కుర్చీమీద కూర్చుండగా రంగనాయకివచ్చి తల్లిచెంత నిలిచెను. "ఇప్పు డడగండి యేం చెపుతుందో." అని పంతులనగా అందరును ఒక్కమారే "రంగా! పెళ్లాడతావా?" అని యడిగిరి. వెంటనే ఆబాలిక ముక్తకంఠముతో "ఆడతాను" అని చెప్పెను. పంతులుకు ఆనందము వెల్లివిరిసిపోయెను. సానులకు విద్యుదాఘాతము తగిలినట్లయినది.

"నా ప్రయత్నం చాలావరకు ఫలించింది. ఇక మీరేమంటారూ?"

"చెప్పడాని కేంవుందీ? మా రంగమ్మ పద్ధతి మొదటినుంచీ వేరే. అది యిదివరకప్పుడప్పుడు "పెళ్లాడతాను" అంటూనే వచ్చిందిగాని ఆకోరిక యింత దృఢంగా వుంటుందని నేను అనుకోలేదు"

"సరే."

"ఇలాంటి వుద్దేశంగల పిల్ల సానిగావుండి తగ్గ లేదు. తరవాత దాన్ని యేడిపించడం మంచిదిగా తోచదు."

"బాగుంది."

"నేనప్పుడప్పు డనుకుంటూ వుంటాను. ఏమనీ? సానులలో కులస్త్రీలువుంటారనీ, కులస్త్రీలలో సానులు వుంటారనీనీ"

"యథార్థం."

"స్త్రీకి పదహారేళ్లేనా వస్తేగాని యీవిషయం తేలదు. కనక అందాకా పెళ్లిచెయ్యకుండా వుంటే మంచి దనుకుంటాను."

"నువ్వు పెద్దవిషయాలు ప్రస్తావిస్తూ వున్నావు. నువ్వుచెప్పే మాటన్నిపట్టి మాస్తే శీలవైశిత్యము ఉన్నవాళ్లకే పెళ్లిచేస్తే మంచిదని తేలుతుంది."

"అవునండి."

"అయితే అసలు పెళ్లియొక్క వుద్దేశం యేమిటి? ధర్మప్రజాసంపత్తి అని ఆపస్తంబాదులు చెప్పేరు. ప్రజోత్పత్తి కులటలలోగూడావుంది కనక ధర్మమే ఆరెంటిలో ప్రధానం. అనగా స్త్రీగాని పురుషుడుగాని వీకాచారత్వాన్ని విడిచిపెడితే వారి వివాహం భ్రష్టమైపోయిందన్నమాట."

"అందుకు సందేహం వుందాండి?"

"ఉందని యెవరు చెప్పగలరూ? దీనివల్ల వివాహం అనేది స్త్రీకి పురుషుడికీగూడా ఐచ్ఛికం అని తేలుతూ వుంది. హిందువులు పురుషుడు బ్రహ్మచారిగావుండిపోతే అంగీకరిస్తారు; కాని స్త్రీ కన్యగా వుంటే గోల పెడతారు. పురుషుడు ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్నా వూరుకుంటారు; కాని స్త్రీ పునర్వివాహం చేసుకుంటానంటే మండిపడతారు. పురుషుడు వకభార్యని విడిచిపెట్టి-అంటే ఆమె జీవితాన్ని నాశనంచేసి- యింకో స్త్రీని పెళ్లాడితే యెవరూ యేమీ అనరుగాని స్త్రీకి అలాంటి అధికారం లేదంటారు. మొత్తానికి హిందూసంఘంఅంతా యిలాంటిదోషాలతో నిండివుండడంచేతనే యింకగా కూలిపోయింది."

"చిత్రం."

"పొరపాట్లు అంతటా వుండవచ్చును. మూఢవిశ్వాసాలు అన్నిమతాల్లోను వుండవచ్చు; గాని హిందూజాతిలాంటి మూఢజాతి ప్రపంచకంలో లేదు. ఈజాతిలోకూడా పెద్దపెద్ద మహానుభావు లుద్భవించారు గాని అందరుకూడా అనాలోచితంగా వర్ణవ్యవస్థకి కట్టుపడడంచేత సంఘం వల్లిపోయింది."

"చిత్రం."

"ఇది యిలా వుండనియ్యి. ప్రస్తుతాంశానికి వద్దాను. నాప్రయత్నం చాలావరకు ఫలించింది. పర్యవసానం రేపుసాయంత్రం చెబుతాను. రంగనాయికి స్త్రీరత్నం. ఆమెకి తగిన పురుషరత్నం నా దృష్టిలో వున్నాడు. అతను సంగీకరిస్తే రేపురాత్రి అతనూ నేనూ మీయింటికి వస్తాము. అతను సంగీకరించకపోతే నేను మీతో యిక మాట్లాడను. ఎవణ్ణో వకణ్ణి తీసుకు వచ్చి రంగనాయికను పెళ్లిచేయడం నాకిష్టం లేదు. మేము వచ్చినా రాకపోయినా రేపురాత్రి పదిగంటలు మొదలు పదకొండుగంటలదాకా మీయింటో నువ్వూ, నీకూతుళ్లుయిద్దరూ తప్ప మరివక స్త్రీగాని పురుషుడు గాని వుండకూడదు. ఈలోపుగాగాని తరవాతగాని— అంటే అయిపోయేదాకా రంగనాయిక పెళ్లిసంగతి యెవరికీ— నీఅల్లుళ్లకీ, కొడుక్కీ కూడా— తెలవకూడదు."

"నాకొడుక్కి తెలవకపోతే యెలాగండీ!"

"తెలవకపోతేనే మంచిదని నావుద్దేశం."

"అంతకాలమూ—"

"అవునవును. ఈరహస్యం సంగతి మందతనితో గట్టిగా చెప్పు. రహస్యభేదనం అయిందంటే కొన్ని చిక్కులు వున్నాయి."

"చిత్రం."

"మరి మీరు రేపు వెళ్లండి."

"సలాం."

"శుభం. మీమంచిబుద్ధికి నేను చాలా సంతోషించాను. ఈశ్వరుడు మిమ్మల్ని రక్షిస్తాడు. రంగనాయిక పెళ్లిచేయగలిగితినా అది నాజీవితానికంతా ప్రకాశం కలిగిస్తుంది. మరివెళ్లండి."

సానులందరును పంతులుకు నమస్కరించి బయలు దేరిరి. పంతులు "రంగా!" అని పిలువగా ఆమె నిలిచి పోయెను. పంతులు లేచి ఆమె చెంతకువచ్చి "అమ్మా! నీకు చెప్పవలసిం దేమీ లేదు. నీమూలంగా మీజాతి బాగుపడుతుంది. దేశం బాగుపడుతుంది. నీకు చెప్పిన మాటలు మరిచిపోకు. తల్లీ! రేపురాత్రిదాకా నేనుచెప్పిన రహస్యాన్ని కాపాడు" అని చెప్పెను. రంగనాయికి శిరమువంచుకొని "చిత్త"మని పలికి మరియొకమారు నమస్కరించి తనవారిని కలిసికొనియెను. పంతులు బ్రహ్మానందపరవశు డయ్యెను.

చెప్పినచొప్పున మరునాటిరాత్రి తొమ్మిదిగం టలకు పంతులు రాజామణియింటికి వచ్చెను. రాజామణి స్వాగతమిచ్చి చూడగా పంతులువెనుక ప్రకాశ ముండెను. రంగనాయికి సిగ్గుపడెను. ఆమెయక్కలు తెల్ల పోయిరి.

పంతులు కుర్చీమీద కూర్చుండగా ప్రకాశ మాత నివాదకుల సన్నిధిని కూర్చుండెను. సానులందరును ఎదుట కూర్చుండిరి. పంతులు పిలువగా రంగనాయికి ఆతనికుడిప్రక్కన నిలిచెను

"వరుణ్ణి తీసుకొనివస్తానని నిన్నరాత్రి చెప్పేను. ఈశ్వరానుగ్రహంచేత ఈవాళ అలాగు గలిగేను. ఇతణ్ణి మీరు చూస్తున్నారు. ఇతనిమీద కసిగాకూడా వున్నారు. అయినా రంగనాయికని పెళ్లాడడానికి యింతకంటె మంచివరుడు పృథివిమీద లేడు. ఇతను స్వచ్ఛమైన వెలనాటి కుటుంబంలో పుట్టి పెరిగాడు. కాని బీదవాడు. 'మా'అన్న శబ్దం లేదు. తల్లిదండ్రీకూడా లేరు. ఒక్కసోదరిమాత్రం వుంది. ఆమె భర్తతో కాపురం చేసుకుంటూవుంది. ఇతను పైమరీ మొదలు కొని వక్కతరగతిలోనైనా అపజయం అనేదిలేకుండా పైకివచ్చాడు. ఈయేటితో — అంటే వచ్చే మార్చితో బి. యే. అయిపోతాడు. ఇతనికున్న ధనంఅంతా అదే నాలుగుసంవత్సరాలనుంచి వాకిష్ముడుగా వున్నాడు. సంవత్సరం క్రిందట విశేంతువుని పెళ్లాడడానికి నిశ్చ యించుకున్నాడు. అయితే యిప్పుడు బ్రాహ్మసమాజం లో కలవవలసి వాద్యనేవున్న విజయవతీ, గుణవతీ, రూపవతీ అయిన కవయిత్రివిశేంతువును పెళ్లాడా లనుకుం టున్నాడు. కనకనే మీపిల్లని పెళ్లాడడానికి అంగీక రించినాడు. ఇతను మీపిల్లని గోదాకరిలో పట్టుకున్నా డని మీకు కోపంగదా! మీపిల్లని పట్టుకున్నవాడే ఆమెను పెళ్లాడుతున్నాడు. ఇంకేమి?"

"బాగానే వుందండీ. ప్రస్తుతం మాజాతిని గురించి కొంచెం చెబుతాను. మంచో చెడ్డో యీజాతి యిలా నడుస్తోంది. మాలో పెళ్లిళ్లుకూడా జరుగుతూనే వున్నాయి. కాని మంచివరులు దొరకడంకష్టం. ఈకార ణంచేతకూడా కొందరు తమబిడ్డల్ని సానులుగా చేస్తు న్నారు. అగ్రజాతులవా రెవరేనా పెళ్లాడడానికి సిద్ధప డితేనూ పిల్లలలో అనేకమంది కులస్త్రీలు అవుతారు."

"నువ్వన్నమాట చాలా మంచిదే. ఇందులో రెండుకష్టాలు వున్నాయి: పెళ్లిచెయ్యడానికి సానులు అంగీకరించడం వకకష్టం; సానికూతుర్ని పెళ్లాడడానికి అగ్రజాతుల యువకులు సిద్ధపడడం అంతకంటె కష్టం. రంగనాయికి పుణ్యం మంచిది కనక నువ్వూ మా ప్రకా శంగారూ కలుక్కున అంగీకరించారు."

"మీరు తెచ్చినవరుడు నాకిష్టమే. మరి నా బిడ్డ యేమంటుందో?"

"తక్కిన నీవాళ్లేమంటారు?"

"ఏమన్రా?"

"నాకిష్టమే."

"నాకంగీకారమే."

"నాకు వప్పుదలే."

"నాకూ సంతోషమే."

"సెబాస్! ఇకరంగనాయికి సంగతా? అది నిన్నరాత్రే అంగీకరించింది. లేకపోతే నేను ప్రకా శాన్ని యిక్కడికి తీసుకురాకనే పోదును. అయినా మీరుకూడా వినవలసిందే. అమ్మా! రంగనాయికా! నీవుద్దేశం చెప్పు."

"నేను వారినే పెళ్లాడతాను."

రాజామణి తటాలున ఆమెను కౌగిలించుకొని రొదెను. అక్క లందరును ముట్టుకొని లాలించిరి.

పిదప పంతులు రంగనాయి న్ను, ప్రకాశమును బొబ్బిలమీదకూర్చుండజేసి ఒకరిచేతనొకరికి తాంబూలా లిప్పించి దీవించెను. సాములుగూడ దీవించిరి. పంతులు పౌర్ణమివెళ్లిన రెండవదినమున (ఆరుదినముల గడువు) వివాహమని చెప్పి బయలుదేరెను.

వెళ్లుచు వెళ్లుచు వారిద్దరు సాములనందరిని సంబోధించి "మీకు తెలవందేమీ లేదు. అనేక కారణాలచేత యీ వివాహవిషయం మీ రతిరహస్యంగా వుంచాలి. మీ పురుషులకైకూడ తెలపనివ్వకూడదు. పెళ్లినాటి మధ్యాహ్నం మీకు కావలసినవాళ్లు నందరినీ పిలుచుకోండి. అప్పుడేనా వరుడు ఫలానా అని చెప్పవద్దు. ఈవివాహం చూడడానికీ, దంపతుల్ని ఆశీర్వదించడానికీ నాతోగూడా పెద్దలనేకులు వస్తారు. అందర్నీ మీరు గౌరవించాలి. పీటలమీద కూచునేటప్పుడు మాత్రమే వరుడెవరో అందరికీ తెలవాలి" అని చెప్పి వెడలిపోయెను.

పిమ్మట ఆతల్లీకూతుళ్లందరును వరవర్ణనము ప్రారంభించిరి. పెద్దపిల్ల "శాంతమైనవాడు" అనియెను. పోలీసులకు చెప్పించినపిల్ల "ఆవేళ గోదావరిలో నేను మొగం సరిగా చూడనే లేదు. చామనచాయ అయినా రంగన్నకి తగినవాడే. పక్కపాపిడి క్రాపింగు చేత మొగం యెంతో బాగుంది. కళ్లల్లో నిదానమూ, గాంభీర్యమూ వున్నాయి. మొగం కలకల్లాడుతుంది" అనియెను. మూడవ కూతురు "ఇరవై యేళ్లకంటే ఎక్కువ వుండవు. నాకు మీసాలలో యెంతో చక్కదనం వున్నది" అనియెను. నాల్గవపిల్ల "పొడుగూ పొట్టీ కాదు. లావూ సన్నమూ కూడా కాదూ. అన్నివిధాలా చెల్లాయికి తగినవాడు" అనగా రాజామణి "బి. యే., అయినాతరువాత, పెద్దవుద్యోగం అవుతుంది. రంగం అదృష్టం" అనియెను. ఇట్లు కొంతసేపైన తరువాత "పెళ్లికొడుకుసంగతి జాగ్రత్త" అని చెప్పి రాజామణి పోయి శయనించెను. సినిమాకు పోయిన పురుషులు వచ్చినంతవరకును ఆయక్కచెల్లెండ్రు ప్రకాశము సంగతియే చెప్పుకొనుచుండిరి.

౬

అటు కన్నెరికపు బేరములు జరుగుచుండగా ఇటు వివాహనిశ్చయమును. వేశ్యావాటిక అంతయు గందరగోళముగా నుండెను. సాములకంటె విటులే ఆశ్చర్యపడసాగిరి. ఎవరి నడిగినను, ఎట్లు ప్రయత్నించినను వరుని సంగతి తేలలేదు. మాధవరావుగూడ "చెప్పలే" ననియెను.

అంతవరకును రహస్యముగ కన్నెరికపు బేరాలు చేసిన సాహుకారు ఇప్పుడు బయలుపడెను. ఎనిమిది వందలకే అంగీకరింపని యాతడిప్పుడు వేయున్నూట పదారు లిచ్చెద ననియెను. అయినను ఆయాశ వదులుకొమ్మని జవాబు వచ్చెను. రంగనాయికను చూపినను చాలునని రెండుసారులు వచ్చెను; గాని లాభము లేకపోయెను. ఎంతో ప్రాధేయపడగా "మరివకరి భార్యని నీవెందుకు చూడాలయ్యా!" అని ప్రత్యుత్తరము వచ్చెను. "పెళ్లికొడు కెవరో చెప్పండి" అని యడుగగా రాజామణి "మీ కేమిపని!" యని కచ్చితముగా నడిగెను.

కచేరీలో రామదీక్షితుడే విచారణకు వాయిదా కోరెను. "పిల్లకి పెళ్లిచేస్తారుటే" యని పోలీసు లడుగగా దీక్షితుడు "దానికల్లునకిచ్చినబా; యేమిటో!" అనియడిగెను. "మీ కేసుకోసం మమ్మల్ని పెళ్లిమానుకోమంటారుటండీ!" యని రాజామణి యడిగెను. "పెళ్లికీ కేసుకీ సంబంధం యేమిటి? మీ ప్రయత్నాలు మీరు మానవద్దు. ఇంట్లో నా పెత్తనం యేమీ సాగదు. నామట్టుకు నేను మీ రెలా చెయ్యమంటే అలా చేస్తాను" అని మాధవరావు చెప్పెను. "కేసు తీసేసుకుంటాం మాకు ప్రజంటుమట్టు చెప్పా" అని ప్రకాశము నడుగగా వారిదు "మళ్లీ యీ ప్రస్తావన తెచ్చారంటే మీసంగతి దొరకి రిపోర్టుచేస్తా" నని యెను. వారిని పిలిచికొనివచ్చిన వైశ్యయువకుడు "ఆవేళ మిమ్మల్ని పిలవమంటే పిలిచాను. ఇందులో నా పూచీ యేమివుంది!" అనియెను. వివాహముసంగతి డిప్టీ సూపరింటెకి చెప్పగా "పెళ్లి నిలుపుచెయ్యడానికి మన కేమైనా అధికారం వుందా!" అనియెను. చేయునది లేక సబిన్స్పెక్టరు మొగము దిగాలు వేసికొనియెను.

సర్కిలు ఇనస్పెక్టరు "పెళ్లికొడుకు కెవరో తెలుసుకోండి" అని చెప్పెను; గాని యెవరును ఆప్రయత్నము చేయలేదు.

వివాహదినము వచ్చినది. మాధవరావు గృహాలంకారమున చాలనైపుణ్యము చూపెను. పరసులు అవసరవస్తువుల నన్నిటిని సమకూర్చిరి. రాజామణి మధ్యాహ్నము బయలుదేరి యిద్దరు కూతుళ్లతో వెళ్లి బంధువుల నందరిని పెళ్లికి పిలిచెను. అందరును "పెళ్లికొడుకెవరూ" అని యడిగిరి. గాని యామె "వస్తారుగాదూ?" అని మాత్రమే ప్రత్యుత్తర మిచ్చెను. వీరేశలింగము పంతులు గూడ రావలసినవారి నందరిని ఆహ్వానించెను. దీనితో పట్టణమంతయు నుడికిపోయెను. 'మాయచేసి యే అనాయిక పిల్లదికో భోగందాన్ని కట్టిపెడుతున్నాడు పంతులు' అని సంస్కారవిముఖులు గోల ప్రారంభించిరి. 'వితంతువులకు మళ్లీపెళ్లి చెయ్యడం బాగానేవుంది. వర్ణసాంకర్యంకూడా చేస్తారు పంతులుగారు' అని సంస్కారాభిమానులు చెప్పుకొనసాగిరి. "అపహాసం వున్నా, ద్వేషాలువున్నా, హెచ్చుతగ్గులువున్నా, అవన్నీ మనలో వర్ణవ్యవస్థవల్లనే వచ్చిపడ్డాయి. ఈకులపద్ధతి యెంతత్వరగా నాశనమైతే దేశం అంత త్వరలో బాగుపడు"నని బ్రహ్మసమాజసభ్యులు చెప్పసాగిరి.

సాయంత్రమైనది. అనుచరవర్గముతో పంతులు రాజామణి యింటికివచ్చెను. ఆయనను రులయం దొకరై యున్న ప్రకాశమును పదిసెలు జలకమాడించి అలంకరించి యెక్కడ పెండ్లిపీట వేయుదురో అక్కడికి సమీపమున నున్న గదిలో నుంచిరి. పంతులు వీధిగుమ్మమున నిలిచి వచ్చిన పెద్దల కందరికి స్వాగత మిచ్చెను.

జిల్లాజడ్జీ, సబుకలెక్టరు, కాలేజీప్రిన్సిపలు, తహసీల్దారు, మాజస్ట్రేటు, కోర్టుమున్సబులు, సబుజడ్జి, పోలీసుపెద్దదొర, చిన్నదొర, సర్కిల్ ఇనస్పెక్టరు, కొందరు ప్లీడర్లు, రామదీక్షితుడు, పెద్దల సంపాదనతో తగువానుష్క్య లనిపించుకొనుచున్న నిర్వ్యాపారులు, మున్నగువారనేకులు వచ్చిరి. నాలుగేడ్లదీనంతి కనుక నది సరిపోయెను; గాని లేకున్న అందరును వీధిలోనిలువవలసినదే.

పదున్నర రైనది. పంతులు బ్రహ్మోపాసనము నధిష్ఠించెను. రాజామణి రంగనాయికను తెచ్చి పీటమీద కూర్చుండబెట్టెను. పంతులు కనుసన్నమీద రాజామణి పెద్దకూతురు తలుపు తీయగా మునిమునిసనగవులతో ప్రకాశమువచ్చి రంగనాయికచెంత కూర్చుండెను. కరతాళధ్వనులు మిన్నుముట్టెను. మంగళవాద్యములు భోరుకలంగెను. కొందరు "సెబాస్" అనిరి, కొందరు నిర్విణ్ణులైరి. కొందరు ఆశ్చర్యపడిరి. కొందరు "కలికాలం" అనిరి. కొందరు చకితులైరి. దొరలు, సంస్కారప్రియులు పంతులుపట్టుదలను కొనియాడిరి. అందరు నవే కథనముల చెప్పుకొనిరి

యుక్తసమయమున యుక్తరీతిని వివాహకృత్యములన్నియు ముగిసెను. పానులు కంఠములెత్తి పాడి మంగళహారతి యిచ్చినపిదప పంతులు వధూవరులను లేవదీసి సభలో నున్న ఆసనములమీద కూర్చుండజేసి జరిగిన వంతయు నుపన్యసించెను. పిదప ప్రిన్సిపలు లేచి యిట్లు చెప్పెను.

"ఆంధ్రదేశచరిత్రలో ఈనిమయం ప్రత్యేకప్రకరణంలో వర్ణింపదగ్గది. ఈవివాహంవల్ల ఈపట్టణానికి చాలా శోభ కలిగింది. ఈవివాహంయొక్క పూర్వచరిత్ర అంతా పంతులుగారు బాగాచెప్పేవున్నారు. యుక్తసమయములో వారుపూనుకొనక పోయినచో వేశ్యజాతిలో నూతనాధ్యాయాన్ని ప్రారంభింపచేసిన యీబాలిక కుంభీపాకనరకంలో కూరుపోయివుండును. తల్లులయొక్క అవివేకంవల్ల యీజాతిలో యింకా యిలాంటిబాలికలు చాలామంది చెడిపోతున్నారు. సంగతులన్నీ బాగాశోధిస్తే యేవేశ్యాకూడా తనబిడ్డన్ని పాడుచేసుకో డానికి సాహసించలేదు. దీనికంతకీ అగ్రజాతుల స్వార్థంకొంతా, ఔదాసీన్యంకొంతా కారణాలైవున్నాయి. మీసంఘంలోవుండే ఆచారాలు యిప్పుడు చాలామట్టుకు మీశాస్త్రాలకీ, ప్రపంచసభ్యతకీ గూడా దూరంగానేవున్నాయి. ఈసంగతి తెలిసికోవడం వకరయితే, సంఘాన్ని మంచిదారిలో నడపలూనుకోవడం వకటయితేను. ఈవిషయంలో ఆంధ్రదేశానికల్లా వక్కవీరేశలింగం పంతులుగారే కనబడుతున్నారు. వారికంటే విద్వాంసులూ, ధనికలవారూ, మంచీచెడ్డా తెలిసిన

వారూ, కష్టసుఖా లెరిగినవారూ, దేశంయొక్క [ఉ]న్నతికి వగచేవారూ, మీలో చాలామంది వుండ వచ్చును; గాని యీశ్వరసందేశాన్ని విని, దాన్ని బాగా బోధపరుచుకుని, ఆచరణలో పెట్టగలవారు పంతులుగా రొక్కరే కనబడుతున్నారు. వాస్తవంగా శంకరరామానుజాదుల తరువాత పంతులుగారు మళ్లీ అంతవారని చెప్పడానికి ఏమీ సందేహం లేదు. పంతులుగారి వుద్దేశాలను ఖండించేవారు కొందరుండడం నిజమే. పంతులుగారు సంఘాన్ని పాడుచేస్తున్నారనడమే కాని తాము నమ్మినధర్మాన్ని పునరుద్ధరించడంకోసం వా రేమీ ప్రయత్నించడం లేదు. చెడిపోయిన సంఘాలని బాగుచెయ్యాలన్నప్పుడు పూర్వశాస్త్రానుసరణం యెప్పుడూ యెవరికీ సాధ్యంకాదు. పూర్వం యెప్పుడో నిర్ణయింపబడ్డ సంఘనియమాలలో కొన్ని కాలాన్నిబట్టీ, సంస్కారాన్నిబట్టీ, పాత్రలబట్టీ, ప్రభుత్వాన్నిబట్టీ దిద్దబూనే వారికి అసహ్యంగా కనబడడం ప్రపంచకం అంతటా వున్నదే. ఇంతవరకు సంస్కారాన్ని నడిపిన యే ఆచార్యుడూకూడా కేవలమూ పూర్వశాస్త్రాలను అనుసరించి మాత్రమే పనిచెయ్య లేదు. అలా చెయ్య లేదుకూడాను. సంతత సాహచర్యం వల్లనైతేనేమి, సంస్కారవైముఖ్యంవల్లనైతేనేమి, పంతులుగారిఘనతని ఈపట్నంలోని వా రనేకులు గ్రహింప లేకపోవచ్చును; గాని వారు ఉపాధ్యాయులుగా వుండడంవల్ల నాకాలేజీ చాలా పవిత్రమైనదని నేను నమ్ముతున్నాను. వారిస్నేహంవల్ల నాగౌరవం పెరుగుతూవుందని నేను చాలా ఆనందిస్తున్నాను. అయితే నేటివరకూ వారిఅనుచరులలో వారికి తగినవారు లేకపోయినందుకు నేను చాలా విచారించుతున్నాను. తెలుసుకుంటే — శ్రద్ధచేస్తే మా ప్రకాశం అంతవాడు కావచ్చును ప్రకాశం నాప్రియశిష్యుడు. నా కాలేజీకంతకీ దీపంవంటివాడు. నేడు అతడు ఒక పతితసంఘంలోని పిల్లని పెళ్లాడడంలో తన విద్యాధికతకు తగిన ఔన్నత్యాన్నీ, జ్ఞానానికి తగిన విచక్షణతనీ, తన అభిజాత్యానికి తగిన ఔదార్యాన్నీ వెల్లడించి స్తుతిపాత్రుడైనాడు. ఈ సాహసకృత్యంవల్ల అతడు ఇప్పటి శిథిలసంఘానికి కొంచెం దూరం అయినా ఈ బాలికారత్నంయొక్క సాహచర్యంవల్ల అతని జీవితం ప్రకాశమానమై అనేకులకు ఆదర్శం కాగలదు. ఇప్పటిప్పుడు హిందువులలో కొందరు వేశ్యావృత్తిని తగ్గింప బూనుకొనివుండడం మంచిదే; గాని వుపన్యాసాలవల్లా, వ్యాసాలవల్లా తగినంత ప్రయోజనం కలగదు. నేడు అనేక కారణాలవల్ల వేశ్యాకులంలో వున్న కన్యలకు ఆకులంలో తగినవరులు లేరు. అందేత సంస్కారం ప్రారంభం కావలసిన ఈ సందిగ్ధసమయంలో అగ్రజాతులయువకులు ఆబాలికలను పెళ్లాడడానికి ముందుకు రావలసివుంది. అగ్రజాతులు ఆజాతికి చేసిన ద్రోహం యిట్టి పనులవల్లనే తీరుతుంది; గాని మాటలవల్లా, సానుభూతివల్లా కాదు. ఈ సందర్భంలో యీ బాలికయొక్క తల్లిని గురించి కొంచెం చెప్పవలసివుంది. నలుగురు కూతుళ్లని కులవృత్తిలో దింపిన ఆమె ఈ బాలిక విషయంలో చాలా మంచిపని చేసింది. ఈశ్వరుడు ఆమెని పాపాలనుంచి విముక్తి కలిగించడానికి ఈపని చక్కాలే చాలు. ఆమెనీ, ఈ కుటుంబంలోని తక్కిన వారినీ నేను చాలా ప్రశంసిస్తూ ఈదంపతులను రక్షించవలసినదని పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను."

ఈ యుపన్యాసము ముగిసిన తరువాత పోలీసు పెద్దదొర లేచి వివాహమునకు సంబంధించినవారి నందరిని వినుతించి "ఈవరునిమీద మేము పెట్టినకేసు రేపే రద్దించుకుంటా"మని చెప్పెను. రామదీక్షితుడు లేచి తనకు తెలిసిన సంగతులన్నీ తెలిపి, "కన్నెరికం ప్రస్తావన చేసిన మాధవరావు నేడు ఈ వివాహసందర్భంలో చాలా హుషారుగా వున్నందుకు ఆనందిస్తూ వధూవరులను ఆశీర్వదిస్తున్నా"నని చెప్పెను. ఇంకను మరికొందరు ప్రస్తావించిరి. చివర రాజామణి సమయోచితముగా కొంచెము చెప్పి వచ్చినవారందరికీ తన కృతజ్ఞతను తెలిపి వధూవరుల నాశీర్వదించవలెనని కోరెను.

ఈ సంభాషణలన్నియు విని అచ్చట నున్నవారందరును ఉద్రిక్తులైరి. అనేకులు వధూవరులకు వెలగల పారితోషికము లిచ్చిరి. ప్రిన్సిపలు వధువునకొక వెండిగిన్నెను, వరునకొక రిస్టువాచీని ఇచ్చి "నాశిష్యుడైన ప్రకాశం ఉన్నతినిగురించి నేనెప్పుడూ శ్రద్ధచేస్తూ వుంటా"నని మాట యిచ్చెను.

అంతయు నైనతరువాత మాధవరావును, మరికొంద రాతని బంధువులును వచ్చినవారికి చందన

తాంబూలము లిచ్చి సత్కరించిరి. ఆరాత్రి పంక్తులు కోరికమీద ఆక్షేపణలేనివారు అస్పృశ్య సవర్ణ భోజనమున పాల్గొనిరి. చిత్రవిచిత్రములగు బాణాసంచాలతో రాత్రి గొప్పయూరేగింపు జరిగెను.

ఈ వివాహమునుగురించి అనేక పత్రికలు తమ ఆమోదమును వెల్లడించినవి. దేశభక్తులనేకులు తమ సంతసమును ప్రకటించిరి. సభలలోని అంధకారమును ఆచారసంబంధదోహమునకు దవ్వువ్వుల మార్గా[...] పరాయణుల దుర్వ్యాఖ్యానములుగూడ ఉండినవి.

## సంపాద్యము

# ఈశ్వరోపాలంభన

నాదెళ్ల వెంకట్రావుగారు

సతతంబు న్వెతఁబెట్టుచున్నవి భవిష్యచ్చింత, లద్దాన, వి
స్మృతమైపోయెను నేటిసౌఖ్యలవము న్మిథ్యాదృశంబై; విహం
గతతుల్ సౌఖ్యముఁ గందుచుండుఁగద మాకన్న న్గటా! రేపు మా
బ్రతుకేలాగనుచింత లేనివఁట దేవా! సర్వజీవేశ్వరా!

మ. జగమెల్లం బహు దుఃఖసంకులము హింసాపాంసులం బిట్లొన
ర్పఁగ నేలాభము నీకుఁ జేకురునో? నీపాలించులోకంబు లి
ట్లగచాట్లంబడ నేమిగౌరవమొ? లే కాహ్లాదమో? కానిచో
నగుబాటౌననియైన నెంచవొకొ! యేనాఁడేని సర్వేశ్వరా!

శా. మాకష్టాలకు బాధ్యులెవ్వరొ వచింపంగల్గుచోఁ జెప్పుమా
మీకర్మంబులెకాని నేనెపుడు నేమీ చేయలేనందువా
నీకు న్నాకును భేద మెందుఁగలదో? నీయీశ్వరత్వంబు దీ
లోకంబందున దేనికో తెలుపు మాలోచించి సర్వేశ్వరా!

శా. మాయాశక్తిన్ హరియింపఁ గోరియును సామర్థ్యంబు పూజ్యంబొ? లే
కాయిచ్ఛాకలనంబె కల్గదొకొ? శక్త్యాబాధత గల్గియున్?
నీయం దీ యుభయప్రభావములు లేనేలేవొ? కాకున్నచో
మాయామేయగుణాఢ్య! యేల మము నోమంగ రావు సర్వేశ్వరా!